కథ

## జి.పద్మావతి

# మాధ్యమాలు

"ఊ...సినిమా బావుంది! ఈ రెస్టారెంటూ బావుంది! ఏసీలో చల్లగా తింటున్న ఈ ఐస్‌క్రీం బావుంది, నీ ప్రమోషన్, జీతం అన్నీ బావున్నాయి కానీ నా యాభైవేల మాటేం చేసావు! ఎప్పుడిస్తావు?"

"ఇప్పుడేగా ప్రమోషన్ వచ్చి జీతం పెరిగింది. కొంచెం కొంచెం దాచి తీరుస్తాను. వాతావరణం వేడెక్కించకుండా ఇంకోటి తిను! కావాలంటే పిజ్జా కూడా తెప్పిస్తాను!"

"అది కాదురా..నాకు చాలా అవసరం..మా ఆవిడకి అదేదో నెక్లెస్ కొనాలిట, అడగలేదనుకో...నాకే ఇద్దామనుంది" చిలిపిగా అన్నాడు సాగర్.

"నెక్లెస్ అవసరంలోకి రాదు. సరేగానీ ఏమిటీ సినిమా బావుందా! నాకు నచ్చలేదు..అంత విలని జమా...ఇంకో విషయం ఏమిటంటే ప్రేమకి ఫుల్‌స్టాప్. 'పెళ్ళి' మాత్రం కాదు, పెళ్ళి చేసేసి శుభం కార్డు వేసేస్తారు కానీ, అక్కడ్నుంచే అసలు కథ మొదలవుతుంది"

"ఎలా..వాదులాటలు, పన్లు పంచుకోడంలోనా?"

"కాదు...ప్రేమను నిలుపుకోడంలోనూ..ఎప్పటికీ లవర్స్‌లా ఉండడం లోనూ"

"కోరా కాగజ్ థా యేమన్ మేరా!..లిఖ్‌లియా నామ్ ఇస్‌పే తేరా!"

"అలాంటి పాటలు రింగ్‌టోన్‌గా పెట్టకు, ఫోన్ తీయబుద్ధి కాదు అని చెప్పాను. మా ఆవిడ కావాలని ఈ రింగ్‌టోన్ పెట్టింది" అంటూ జేబులోంచి ఫోన్ తీశాడు సాగర్.

ఫోన్ ఆఫ్ చేసి "క్రిష్ణా, అమ్మా వాళ్ళు వస్తున్నారు త్వరగా ఇంటికెళ్ళాలి. ఇంటి తాళాలు నా దగ్గరే ఉన్నాయి!" అంటూ లేచాడు సాగర్. ఇద్దరూ బయటికొచ్చి బైక్ దగ్గరకెళ్ళారు.

బండి తీసి స్టార్ట్ చేసి కొంచెం దూరం వెళ్ళాక ప్రక్కగా ఆపేసాడు సాగర్.

"ఏమయింది సాగర్.. టైమవుతుంది..త్వరగా పద!"

"నీ డ్రస్సు చూసుకున్నావా? వెళ్ళేసరికి అమ్మావాళ్ళుంటే కష్టం కదా" బుర్రగోక్కుంటూ అన్నాడు.

ఒక్కసారి కిందకు చూసుకుంది క్రిష్ణ. బ్లూ జీన్స్, పైన వర్క్ చేసిన ఫుల్‌హేండ్స్ టాప్.."వామ్మో! ఎలా ఇప్పుడు. సినిమా హడావుడిలో త్వరగా రావడంలో చూస్తే ఏమన్నా అనుకోరూ" ఆదుర్దాగా అంది.

"త్వరగా వెళ్ళిపోదాం..వెనక నుండి అదేదో కాఫీ యాడ్‌లాగా చీర కట్టుకొచ్చేయ్"

"మన కిటికీలకు మెష్‌లున్నాయి..ఇంట్లోకి దూరడం కుదరదు. వెటకారమా!" కాస్త ఖంగారుగా అంది.

"పోనీలే..మా కోడలు హైదరాబాదు వచ్చి మోడర్న్ అయింది అనుకుంటారు" బైక్ తీస్తూ అన్నాడు సాగర్.

"అరే బుద్ధూ..అసలు ఇప్పుడు ఎక్కడున్నారు? సరిగ్గా ఫోన్ చేసి కనుక్కో!" చెప్పింది క్రిష్ణ.

"నాంపల్లి స్టేషన్‌కి దగ్గరగా ఉన్నారుట..నాన్నగారు ఫోన్ చేసేసరికి" చిలిగా అన్నాడు.

"కంగారు పెట్టేసావు..నిన్నూ!" అంటూ గుప్పిట మూసి భుజంమీద కొట్టింది క్రిష్ణ.

"మొగుడ్ని కొట్టొచ్చా..అమ్మతో చెప్తాను...అందరూ చూస్తున్నారు చూడు!" అన్నాడు చుట్టూ చూసుకుంటూ.

"నేర్చుకుంటారు. లేదంటే నాకు సహాయం చేస్తారు. ఈ ట్రాఫిక్‌లో మావయ్యా వాళ్ళు వచ్చేసరికి టైం పడుతుంది. నువ్వు ఫోన్ చేస్తూ వుండు. నేను వాళ్ళకి నచ్చినవి చేయడానికి ఐటమ్స్ తీసుకువస్తాను" అంటూ అక్కడే పక్కన ఉన్న సూపర్ మార్కెట్‌లోకి వెళ్ళింది క్రిష్ణ.

బైక్‌కి ఆనుకుని ఫోన్ చేస్తూ ఆమెనే చూస్తున్నాడు సాగర్.

మోడ్రన్ డ్రస్. కళ్ళకి కూలింగ్ గ్లాసెస్ చిన్న చైను. చిన్న బిందీ, హెయిర్ వదులుగా వదిలేసి పైన చిన్న క్లిప్‌మాత్రం పెట్టుకుంది క్రిష్ణ. బ్యూటిఫుల్! ఈ అమ్మాయేనా నేను, కోటిపల్లి రేవు దగ్గర చిన్నఊళ్ళో పెళ్ళిచూపులు చూసింది. పోలికేదీ..అసలు..తను క్రిష్ణేనా అనిపిస్తుంది. ఆలోచిస్తూ ఒక్కసారి వెనక్కి వెళ్ళిపోయాడు సాగర్.

ooo

"ప్చ్..ఇదేం ఊరురా నాయనా! మట్టిరోడ్లు పెంకుటిళ్ళు..మధ్య మధ్య ఎడ్లబళ్ళు..నడిచే దారేనా ఇది! అసలే వర్షాకాలం, బురద బురదగా కాంపౌండ్ వాల్ నుండి పావుగంట నడిస్తేగానీ ఇంట్లోకెళ్ళలేం.." అని విసుక్కుంటూనే ఎడ్రస్ వెతుక్కుంటున్నాడు సాగర్.

"బాబూ..మీరేనా సాగరు..రేవు దగ్గరికే రావల్సింది..ఏమనుకోకండి బాబూ..ఇవాళ వస్తున్నారని తెలియదు. ఇప్పుడే మీరు వస్తున్నారని మా పెద్దయ్యగారికి ఫోన్ చేసి చెప్పారంట మీ నాన్నగారు. పరిగెత్తుకొచ్చాను. మీరే అయ్యుంటారని గుర్తుపట్టేసాను?" చాలా కనిపెట్టేసినట్లు మురిసిపోతూ చెప్పాడతను.

"పెద్దయ్యగారికి చెయ్యడమేంటి..మీకు ఫోన్ లేదా? మీరు ఎవరు..ఇంకా ఇల్లు ఎంత దూరం!" విసుగ్గా ప్రశ్న వేసాడు.

"ఫోన్ ఆఫీసులో ఉంటుందండి. నేను క్రిష్ణమ్మగారి అసిస్టెంట్‌నండి. పెద్దయ్యగారంటే అయ్యగారి అన్నయ్యగారండి"

"ఆఫీసంటే?"

"కంపోస్ట్ ఎరువు తయారుచేస్తామండి. ఏదో కొద్ది కొద్దిగా వ్యాపారం జరిగేది ఈ ఊళ్ళోనే..అమ్మాయిగారు పట్నంలో చదువుకుని యాపారం పెద్దది చేసి పాలిథీన్ కవర్స్‌లో పెట్టించి, సిటీల్లో అమ్మించి, అదనీ..ఇదనీ..ఇంత పెద్దది చేసారండి!"

"అమ్మాయిగారంటే.."

"పెళ్ళి కూతురుగారండీ..ఇప్పుడిక్కడే ఉన్నారు. మిమ్మల్ని ఇంట్లో దింపేసి...!"

"వద్దు. నేనూ ఆఫీసుకే వెళతాను..పదండి!" అన్నాడు.

'ఇతన్ని చూస్తుంటే ఆ అమ్మాయి కూడా ఇలాగే బండగా ఉంటుందేమో...అట్నుండి అటే వెళ్ళిపోవచ్చు..నాన్నగారి మాటా పోదూ..నా పనీ అయిపోతుంది' అనుకున్నాడు మనసులో.

ఆఫీసంటే టేబిల్స్, చైర్స్...ఏసీ ఏం లేవు! చిన్న కేబిన్ ఉంది. దానిమీద ఒక బుక్, ఫోన్ ఉంది. పైన అంతా తాటాకుల్తో కవర్ చేసారు చల్లగా ఉంది. కొన్ని వందల్లో కంపోస్ట్ పాక్ చేసిన పాలిథిన్ పాకెట్స్ ఉన్నాయి కొంచెం దుర్గంధం కూడా వస్తుంది.

"హు..నాలాంటి క్లాస్ ఇంజినీర్‌కి ఇంత దూరం వస్తేగాని పిల్ల దొరకదా! ఎప్పుడో తాతలనాడు అనుకున్నార్ట. చూడాలట, అయినా ఈ పెద్దవాళ్ళంతా ఇంతే..చాదస్తం..ఎక్కువ కట్నం ఇచ్చుకోలేం అన్నవాళ్ళు. నేను ఏభై వేలు అడిగినా ఎలా ఇస్తామన్నారు.

ఇంకా ఎక్కువ అడగాల్సింది. అంతటితో వదిలేద్దురు!" అంటూ తనను తానే తిట్టుకుంటూ సణుక్కున్నాడు.

"సాగరు బాబూ, అదిగో అమ్మాయిగారు.." చూపించి అటువేపు వెళ్ళాడతను.

సినిమాల్లోలా చుట్టూ బ్లాక్ అండ్ వైట్ మధ్యలో హీరోయిన్ కలర్‌లో ఉన్నట్లుగా ఉంది. చెలికత్తెల మధ్య రుక్మిణీదేవి లాంటిది. స్టన్నింగ్ బ్యూటీ..వేయి బాతుల మధ్య హంసలా ఉంది 'ఛీ' అలా పోల్చకూడదేమో. ఏమైనా సూపర్బ్‌గాళ్..ఇంత అందంగా ఉంది. ఇదేం బిజినెస్సూ..చుట్టూ ఉన్న ఆడవాళ్ళు కొంచెం వళ్ళుగా, నలుపుగా ఉన్నారు. వాళ్ళు చీరని గోచీలాగా కట్టారు. హంసగారు మాత్రం కుచ్చెళ్ళు కొంచెం దోపుకుని చేతులకి గ్లోవ్స్ తొడుక్కుని హుందాగా ఠీవిగా నడుస్తూ వాళ్ళకి పని పురమాయిస్తుంది. అంతా అబ్జర్వ్ చేసి అటుచూసేసరికి ఆమె లేదు. అందరూ నవ్వుతున్నారు తన వేపు చూస్తూనూ..చెవినపడ్డ మాటల బట్టి అర్ధమైంది ఏమిటంటే..ఇంటికెళ్ళేలోపుగానే కంగారుపడి ఆమెను చూడ్డానికక్కడికి వచ్చానని వాళ్ళ నవ్వులు. ఇందాక రేవు దగ్గర కొచ్చిన అబ్బాయి ఇంటికి తీసుకెళ్ళాడు.

○○○

సకల మర్యాదలూ అయ్యాయి.

పెళ్ళికూతురు కోసం ఎదురుచూస్తున్నాం. అక్కడే కూర్చున్న పాపను "నీ పేరేమిటి పాపా?" అనడిగాడు సాగర్.

"తెలంగాణా" నోట్లో వేలు తీసి చెప్పింది.

ఉలిక్కిపడ్డాడు సాగర్. "అదేంకాదు బాబూ వాళ్ళ తాతగారితో కూర్చుని టీవీ వార్తలు ఎక్కువ చూసి పేరడిగితే అలానే చెప్తుంది" అని చెప్పి తీసుకెళ్ళిపోయారు ఆడవాళ్ళు. కాసేపు కుర్చీలో కూర్చోబెట్టి తీసుకెళ్ళిపోయారు క్రిష్ణని. పేరడిగితే 'క్రిష్ణవేణి' అని చెప్పింది. అంతే. తిరిగి బయలుదేరారు.

"ఏ మాటా నాన్నగార్ని ఫోన్ చేయమనండి బాబూ!" అని వెనుతిరిగారు.

మళ్ళీ చూడాలనిపించింది సాగర్‌కి క్రిష్ణని, రవివర్మ చిత్రం ప్రాణం పోసుకున్నట్లు ఉంది..రెండు నిమిషాలు మాట్లాడనివ్వలేదు వీళ్ళ సాంప్రదాయం మండిపోనూ.. తిట్టుకున్నాడు. ఇందాకా తిట్టుకున్న ప్రదేశాలన్నీ అందంగా కనుపడ్తున్నాయి, అనుకుంటూ వెనుతిరిగే సరికి సైకిల్ తొక్కుకుంటూ వస్తోంది క్రిష్ణవేణి. ఆ పక్కనే ఆమె అసిస్టెంటు. డైరెక్టుగా అతని దగ్గరే ఆగారు. మారు మాట్లాడకుండా చూస్తూండిపోయాడు సాగర్.

"సత్యం నువ్వు రేవులోకెళ్ళు, వస్తాను!" అని అతన్ని పడవ దగ్గరకి పంపేసింది. అతని వంక ఒకసారి చూసి కళ్ళు దించుకుంది.

"నాకు మీరు నచ్చారు. కానీ మీరడిగిన యాభై వేలు మా నాన్న ఇవ్వలేరు. నేనిస్తాను. పెళ్ళయ్యాక సంపాదించి ఇస్తాను. నేను నచ్చితే చెప్పండి. ఇప్పుడే పడవ మీద రేవు దాటిస్తాను!" నిశ్చలంగా అంది. కొంచెం ఆయాసపడ్తుంది.

"ఇప్పుడే మిమ్మల్ని ఎత్తుకెళ్ళిపోదామనుంది. అంత నచ్చారు" కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

నాకు డబ్బు అవసరం లేదు అని సాగర్ చెప్పలేదు. మీకు డబ్బు ముఖ్యమా అని క్రిష్ణా అడగలేదు. ధూంధాం అంటూ పెళ్ళి జరిగిపోయింది.

"హలో..సాగర్ టైమవుతుంది పదా" క్యారీ బ్యాగ్‌తో అతని ముందు నుంచి అడిగింది క్రిష్ణా.

ఆమె మాటలకు ఈ లోకంలోకి వచ్చాడు సాగర్.


"ఏమిటీ పరధ్యానం?" బండెక్కుతూ అడిగింది.

"యాభై వేలు ఎలా వసూలు చేద్దామా? అని ఆలోచిస్తున్నాను"

మళ్ళీ వీపుమీద కొట్టిందతన్ని "నేవివ్వనుగా" అంటూ బొటన వేలు అటూ ఇటూ తిప్పింది అడ్డంగా.

○○○


రెండేళ్ళ వాళ్ళ పెళ్ళి పుస్తకం మూడో సంవ



త్సరంలోకి అడుగుపెట్టింది. సరదాలు లేవు, కబుర్లూ లేవు. అతనూ, ఆమె ఇద్దరూ జాబ్‌లో బిజీ. ఎక్కువగా మిస్ అయింది క్రిష్ణవేణి. ఆమెకు ఈవినింగ్ ఖాళీ. అప్పుడే అతను మరీ బిజీ. ప్రతీదీ ఫోన్‌లోనే. సెల్‌ఫోన్ అంటేనే విసుగు, కోపం, చిరాకు. తమను దూరం చేసేది..ఉద్యోగాలు ఒక ఎత్తైతే, ఈ ఫోన్స్, ఈ-మెయిల్సు లాంటివే అని ఆమె ప్రగాఢ నమ్మకం.

'కుటుంబాలన్నీ ఈ మాధ్యమాల మీదే ఎక్కువ ఆధారపడ్తున్నాయి. కనీసం సరదాగా కూడా గడపలేనప్పుడు ఇన్ని సంపాదనలెందుకు? ఎవరికోసం? బైక్, కారయింది. ఫ్లాట్ సొంతమయింది. కొన్ని నగలు ఎగస్ట్రా వచ్చిపడ్డాయి. కానీ అనుబంధంలో మాత్రం మొదటి దశలోనే ఉన్నాం..' అనుకుంటూ నిట్టూర్చింది.

ఇంత పని రాక్షసులతో భార్యల పరిస్థితి ఏంటీ?




మహా బోరింగ్, ఒంటరితనం! 'బ్రూతో ఆనందం' అంటూ చిన్న కప్పు అతని ముందుకు తోస్తూ ఆమె చూపించిన కళ్ళల్లో కాంతిని యాడ్‌లో చూస్తూ 'అలా కళ్ళలో కళ్ళు పెట్టి చెప్పలేకపోతున్నాను!' అని బాధపడింది.

'క్యాంప్‌కెళితే రెండేసి రోజులు మాట్లాడకుండానే గడచిపోతున్నాయి. మనుష్యుల్ని కలిపేది ఎస్సెమ్మెస్సులే! కానీ మాధ్యమాలతో కాపురాలు ఎన్నాళ్ళు?'

సాగర్ నిజంగా డబ్బు మనిషా. అందుకేనా ఎంత ప్రేమగా ఉన్నా యాభై వేల గురించి అడిగేవాడు. అతనడిగినప్పుడు పాత జ్ఞాపకాల ఆనంద డోలికల్లో మునిగిపోయి..తను వాస్తవాన్ని గుర్తించలేదా? ఆమె గుండె దడ దడ కొట్టుకుంది. లేచి నుంచుని హాలంతా పచార్లు చేసింది. సాగర్ అలాంటివాడు కాదు. మనసు ఒప్పుకోవట్లేదు. కానీ అన్నీ అమర్చుకున్నాక ఇంత ఆరాటం ఉద్యోగం కోసం అవసరమా..తప్పనిసరే కదా..ఖర్చులు పెరిగితే తట్టుకోవద్దూ..కానీ భార్యాభర్తల మధ్య దూరం పెరిగితే...'సాగర్'.. అంటూ ఆమె భోరున ఏడ్చేసింది.

కళ్ళ నీళ్ళు తుడుచుకుని ఒక్క యాభై వేలకు చెక్కు రాసేసి టేబిల్ మీద పెట్టేసి ఫోన్‌తో సహా వదిలేసి బట్టలు సర్దుకుని బస్ ఎక్కేసింది. "ఐ మిస్ యూ సోమచ్ సాగర్" పదే పదే అనుకుంది.

ooo

రాత్రి రెండు గంటల ప్రాంతంలో ప్రాజెక్టు వర్కు పూర్తిచేసుకుని ఇంటికొచ్చిన సాగర్ తన దగ్గరున్న కీతో లోపలికి వెళ్ళి క్రిష్ణ కనిపించకపోయినా..ఆలోచిస్తూనే అలసటతో నిద్రలోకి జారుకున్నాడు.

'నిన్నే ఇంటికొచ్చి ఉంటాడు సాగర్..కోపంలో సెల్ వదిలేసాను. ఫోనీ ఆఫీస్‌కి ఫోన్ చేయవచ్చుకదా..' ఆమె కళ్ళలో క్రిష్ణవేణి వరదలైపారుతుంది. 'ఇక్కడ పుట్టి పెరిగి ఇంత అనుబంధం పెనవేసుకుని మనసు సాగర్ చుట్టూ ఎందుకు తిరుగుతుంది. అతను నిజంగానే వీళ్ళ ప్రేమను మరిపించాడు. హి ఈస్ ఎ ఫ్రెండ్..నేను సుఖపడాలనే కదా అతను కష్టపడేది!?' ఆమె ఆలోచనలకు అంతం లేదు.

పదవుతుండగా మెలకువ వచ్చిందతనికి. అప్పుడు కానీ క్రిష్ణ ఇంటిలో లేని సంగతి బుర్రలోకి ఇంకలేదు. ఇల్లంతా తిరిగాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఇంట్లో వదిలేసింది. ఈమెయిల్ ఇవ్వలేదు. ఏమీ లెటర్ రాయలేదు. చెక్కు మాత్రం రాసేసింది. ఫోన్ చేసుండచ్చు కదా? అతని ప్రశ్నలోనే అతనికి సమాధానం దొరికింది.

"యస్! షి ఫీల్స్ లోన్లీ! అంతేగాని కోపం కాదు...నిజం మేమిద్దరం కనీసం పిక్చర్‌కి వెళ్ళి రెండు నెలలైంది. సరదాగా మాటల్లేవు. వర్క్..వర్క్. దీంతో ఆమెను మిస్ చేసుకున్నాను. ఫోన్ చేయకూడదు!' అనుకుంటూ చిన్న బేగ్‌లో రెండు డ్రస్సులు సర్దుకుని ఆఫీస్‌కి పంపించేసి కోటిపల్లి బయలుదేరాడు పాత ప్రయాణం గుర్తుచేసుకుంటూ.

ఆమె రాసిన చెక్కు తిరుపతికి ఆన్ లైన్‌లో పంపించేసి, "తీరిగ్గా ఇద్దరం వచ్చి నిన్ను దర్శించుకుంటాం!" అని దణ్ణం కూడా పెట్టాడు. ఇప్పుడతని మనసు హాయిగా ఉంది. బస్సు కోటిపల్లి వేపు పరుగుపెడ్తోంది.

## 'ఉత్త' అమీషానే!

బాలీవుడ్ భామ అమీషా పటేల్ ఆమధ్య తన 'సర్‌నేమ్' పటేల్‌ని ఇకపై తీసేస్తానంది. కారణం-తన తల్లిదండ్రులతో గొడవ పడి విడిపోయి 'సింగిల్‌గా వుంటున్న ఆమె వాళ్లకి సంబంధించిన 'గుర్తింపు' తనకొద్దంటూ 'అమీషా' అని మాత్రమే కొనసాగుతానంది. ఇప్పుడు స్ట్రిక్టుగా దాన్ని ఫాలో అవుతోంది. అమీషా తాజా చిత్రం 'థోడా ప్యార్ థోడా మ్యాజిక్' టైటిల్స్‌లో 'అమీషా' అని మాత్రమే తన పేరుని వేయించుకుంది.

